దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు

- సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- కలెక్టర్ బీ సత్య ప్రసాద్

జగిత్యాల రూరల్, మార్చి 10: ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జగిత్యాల కలెక్టర్ బీ సత్య ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ఆయా శాఖలకు బదిలీ చేసి, వెంటనే పరిష్కారం చూపాలని సూచించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ బీఎస్ లత, జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్ వివిధ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు

డంప్ యార్డును తొలగించాలి

జగిత్యాల అర్బన్ కాలనీ సమీపంలోని డంప్ యార్డు నుంచి వచ్చే పొగతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, శ్వాస సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నామని, వెంటనే తొలగించాలని కాలనీకి చెందిన ఖలీల్ ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. కాలనీలోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ట్యాంకర్ ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదన్నారు. మౌళిక వసతులు కల్పించాలని కోరారు.

ఆస్తి కోసం ఇంట్లోనుంచి గెంటేసిన్రు

ఆస్తి కోసం తన కొడుకు, కోడలు ఇంట్లో నుంచి గెంటివేశారని, తనకు న్యాయం చేయాలని వెల్గటూర్‌కు చెందిన లవంగపు చిన్నమ్మ ప్రజావాణిలో విన్నవించింది. గ్రామంలో తన పేరిట మూడెకరాల భూమి ఉందని, ఇది వరకే ఎకరం పట్టా చేశానని పేర్కొంది. అయితే మిగిలిన భూమి కూడా పట్టా చేయాలని వేధిస్తున్నారని, ఇంట్లో నుంచి గెంటేశారని, డయల్ 100కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయింది.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లి రూరల్, మార్చి 10: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను వేంపేట శివారులో టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు సోమవారం పట్టుకున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కారు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

పెగడపల్లి, మార్చి 10: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఇద్దరితోపాటు ఇంటి ముందు నిల్చున్న మహిళను కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన బతికపల్లిలో సోమవారం రాత్రి జరిగింది. పెగడపల్లి ఎస్ఐ రవికిరణ్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సయ్యద్ సర్వర్ పాషా, జాకీర్ పాషా నమాజ్ చేసేందుకు నడుచుకుంటూ మసీద్‌కు వెళ్తున్నారు. అలాగే లెక్కల విజయ తన ఇంటి ముందు నిలబడి ఉండగా, ఇదే గ్రామానికి చెందిన పంగ రాజయ్య కారు నడుపుకుంటూ వచ్చి, వెనుక నుంచి ఢీకొట్టాడు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు వచ్చి దవాఖానకు తరలించగా, ఇందులో సర్వర్ పాషా పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. రాజయ్య మద్యం మత్తులో ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తుండగా, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు.

కొండగట్టులో పవిత్రోత్సవాలు ప్రారంభం

కొడిమ్యాల, మార్చి 10: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలు (త్రయాహ్నికం) ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు తిరుమంజనం, ఆరాధన, పుణ్యాహవాచనము, రక్షాబంధనం, యాగశాలప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంతరావు, స్థానాచార్యులు కఫేందర్, ప్రధాన అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను ఇబ్బందులు పెడితే ఊరుకోం

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మల్లాపూర్, మార్చి 10: గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకోమని మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు హెచ్చరించారు. మండలంలోని రత్నాపూర్ గ్రామంలో ఆర్బీఎస్ జిల్లా మాజీ డైరెక్టర్ దేవమల్లయ్యకు చెందిన గొర్రెల షెడ్డును రెవెన్యూ అధికారులు కూల్చి వేస్తున్నారనే విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకొని అధికారులు, కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం విద్యాసాగర్‌రావు విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో కొంత మంది కాంగ్రెస్ నాయకులు అధికారం అడ్డం పెట్టుకొని బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమకు చట్టం, న్యాయస్థానాలపై పూర్తిగా నమ్మకం ఉందని, తమ కార్యకర్త మల్లయ్య నిర్మించిన గొర్రెల షెడ్డు విషయంలో కోర్టు, రెవెన్యూ అధికారుల ఆదేశాలు పాటిస్తున్నాడని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు అధికారం ఉపయోగించి ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి తెచ్చి ఇష్టానుసారంగా వ్యవహరించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, ఈ విషయాలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, నాయకులు కాటిపల్లి ఆదిరెడ్డి, కొమ్ముల జీవన్‌రెడ్డి, ముద్దం శరత్‌గౌడ్, దరిశెట్టి రాజేశ్, భైరి రాకేశ్, రవి, డబ్బ రమేశ్, పెద్దిరెడ్డి లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనర్సింహాస్వామి కల్యాణం

వెల్గటూర్, మార్చి 10: నాగపల్లిలో లక్ష్మీనర్సింహాస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం గ్రామం నుంచి ఉత్సవ మూర్తులను మహిళలు, యువకుల కోలాటం ఆడుతూ ఊరేగింపుగా గుట్టపైకి తీసుకువచ్చారు. వేద పండితుడు జగన్నాథం విష్ణువర్ధనాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్, కోశాధికారి తరల్ల శివకుమార్, ఉపాధ్యక్షుడు పాదం సురేశ్, మాజీ అధ్యక్షుడు కుమ్మరి వెంకటేశ్, పూదరి రమేశ్, ధర్మకర్తలు దాసారపు రాంచందర్‌రావు, అన్నమనేని గజేందర్‌రావు, గౌరి లక్ష్మీనారాయణ, బైరం చిన్నయ్య, తిరుపతి, మల్లేశం, అర్చకులు సాయికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

భూమి పట్టా చేయించాలని వినతి

మల్లాపూర్, మార్చి 10: మండలంలోని సిరిపూర్ సహకార సంఘంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ సత్యప్రసాద్‌కు సహకార సంఘం పాలకవర్గ సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో పని చేసిన సంఘం సీఈవో పరమేశ్ రూ.2.20 కోట్ల మేర దుర్వినియోగం చేశారని అధికారులే నివేదిక ఇచ్చారని, దీనికి గానూ ఆయనకు సంబంధించిన వేంపేట గ్రామంలో ఉన్న 1-02 ఎకరాల భూమిని గతంలో సంఘానికి అటాచ్డ్ చేశారని తెలిపారు. ఈ భూమిని సంబంధిత అధికారుల సహకారంతో వేరే వ్యక్తికి అక్రమంగా పట్టా చేశారని, సదరు పట్టాను రద్దు చేసి తమ సంఘానికి తిరిగి అటాచ్డ్ చేయాలని కోరారు. ఇక్కడ సహకార సంఘం చైర్మన్ అంజిరెడ్డి, వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, తదితరులున్నారు.

బోనస్ డబ్బులు విడుదల చేయాలి

వెల్గటూర్, మార్చి 10: రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు సంబంధించిన బోనస్ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం ఎదుట 7వ నంబర్ రాష్ట్ర రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావు హనుమంతరావు, పొన్నం నరేశ్, సబ్బు సంతోష్, గోపనవేని గంగాచలం, దివాకర్, సాగర్, ఎనగంటి రమేశ్, తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మపురి, మార్చి 10: ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది మేళతాళాలతో బ్రహ్మోత్సవ పూజలు నిర్వహించే యజ్ఞాచార్యులు, వేదపండితులు, అర్చకుల వద్దకు వెళ్లి దీక్షవస్త్రాలను సమర్పించి ఉత్సవాలకు ఆహ్వానించారు. అనంతరం ఆలయంలో యజ్ఞాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి ఘట్టమైన పుట్టబంగారం పూజా కార్యక్రమాన్ని సాయంత్రం నిర్వహించారు. కాగా, మంగళవారం సాయంత్రం 6 గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనుండగా ఆలయ మాజీ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అలాగే, స్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలను కలెక్టర్ సత్యప్రసాద్ సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

పాఠశాలలో నీటిశుద్ధి యంత్రం ఏర్పాటు

రాయికల్, మార్చి 10: మండలంలోని ఇటిక్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో వీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటిశుద్ధి యంత్రాన్ని మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, వీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోయినపల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన ప్రోగ్రామ్ అధికారి

సారంగాపూర్, మార్చి 10: సారంగాపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బీర్‌పూర్‌లోని పల్లె దావఖాన (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను సోమవారం నేషనల్ క్వాలిటీ అసిస్‌మెంట్ ప్రోగ్రామ్ అధికారి సమీయొద్దీన్ సందర్శించారు. రికార్డులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాధ, సీహెచ్‌వో కుద్దుస్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ మోటార్ల కాపర్ వైర్ చోరీ

పెగడపల్లి, మార్చి 10: ఐతుపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతుల విద్యుత్ మోటార్ల కాపర్ వైరు ఆదివారం రాత్రి చోరీకి గురైంది. బొజ్జం శంకరయ్య, నల్లాల నాగేందర్, గాజుల నర్సయ్య, జెట్టి పోచయ్య, గాజుల వినయ్, రాజేందర్ తమ వ్యవసాయ బావులకు ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లకు సంబంధించిన కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

పసుపు క్వింటాల్ @ రూ.10,526

మెట్‌పల్లి, మార్చి 10: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పసుపు కాడి (కొమ్ము) క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 10,526, కనిష్ఠంగా రూ.6,677, పసుపు మండ (గోళ)కు గరిష్ఠంగా రూ.9,895, కనిష్ఠంగా రూ.6,266, చూర గరిష్ఠంగా రూ.8,383, కనిష్ఠంగా రూ.6,051 పలికింది. కాగా, ఇప్పటి వరకు మార్కెట్‌లో19428 క్వింటాళ్ల పసుపు కొనుగోలు జరిగినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి జాతర

మల్లాపూర్, మార్చి 10: మండలంలోని రాఘవపేట గ్రామంలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి జాతర వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పురోహితుడు మాధవాచార్యుల ఆధ్వర్యంలో హోమం, కుంకుమపూజ, పల్లకీ సేవ, తీర్థ ప్రసాద వితరణ, తదితర ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారి కల్యాణం జరిపించారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్లల్లో వసతులు కల్పించాలి

జగిత్యాల టవర్ సర్కిల్, మార్చి 10: నూకపెల్లి డబుల్ బెడ్రూం ఇండ్లల్లో వసతులు కల్పించాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు భారత్ సురక్ష సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రాజు, పుప్పాల సత్యనారాయణ, నరెందుల శ్రీనివాస్, సింగం గంగాధర్, వేముల పోచమల్లు, బండారి మల్లికార్జున్, ఎడమల వెంకట్ రెడ్డి, గడసు భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

అంధుల వృద్ధాశ్రమానికి విరాళం

రాయికల్, మార్చి 10: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు సేకరించిన రూ. 1.17 లక్షలను హైదరాబాద్‌లో సోచ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంధుల వృద్ధాశ్రమానికి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, పాఠశాల యాజమాన్యానికి, తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులను అభినందించి వారికి ప్రశంసా పత్రాలు, మెడల్స్, మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జే తిరుపతి రావు, ప్రిన్సిపాల్ జే వేణుగోపాల్ రావు, సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి

సారంగాపూర్, మార్చి 10: అంబేద్కర్‌ను అవమానిస్తే సమాజాన్ని అగౌరవపరిచినట్టేనని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. మండలంలోని నాగునూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి కొందరు చెప్పుల దండ వేసి అవహేలన చేసిన విషయం తెలుసుకొని సోమవారం ఆయన వెళ్లారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొండ్ర రాంచందర్ రెడ్డి, జగిత్యాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, మాజీ ఎంపీపీ రమేశ్ బాబు, ఏఎంసీ డైరెక్టర్ రవి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ప్రింటర్స్ యజమానుల అసోసియేషన్ సమావేశం

జగిత్యాల టవర్ సర్కిల్, మార్చి 10: జిల్లా కేంద్రంలో సోమవారం ఫ్లెక్సీ ప్రింటర్స్ యజమానుల జిల్లా అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేశ్ రెడ్డి హాజరయ్యారు. ఇటీవల మృతి చెందిన సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ రవీందర్ చిత్రపటం వద్ద నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీవీ రమణారావు, ఉపాధ్యక్షులుగా ఎలిగేటి శ్రీనివాస్, చలిగంటి వినోద్ కుమార్, జనరల్ సెక్రటరీగా రాజ్‌కుమార్, కోశాధికారిగా సాయి దీపక్ ఎన్నికయ్యారు. సంఘం సభ్యులు వాసు, ఖదీర్, కుమార్, దేవేందర్, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు

వైకుంఠధామంలో బోర్ ఏర్పాటు

కథలాపూర్, మార్చి 10: కథలాపూర్ మండలం భూషణరావుపేటలోని వైకుంఠధామంలో కోనాపూర్ గంగారాం-లింగమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోర్‌ను సేవా సమితి వ్యవస్థాపకుడు గడ్డం భూమారెడ్డి సోమవారం ప్రారంభించారు. వైకుంఠధామంలో నీటి సదుపాయం లేదని అంబేద్కర్ (మాదిగ) సంఘం సభ్యులు విన్నవించగా, రూ. 1.20 లక్షలతో బోర్ వేయించి, మోటార్ ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. దాతను సంఘం సభ్యులు శాలువాలతో సన్మానించారు. సంఘం ప్రతినిధులు గంగాధర్, రమేశ్, ప్రకాశ్, అభి, నాయకులు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

రైతు మహాధర్నాను విజయవంతం చేయాలి

జగిత్యాల/జగిత్యాల రూరల్, మార్చి 10: పసుపుకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మెట్‌పల్లిలో రైతు మహాధర్నా చేపడుతున్నట్లు రైతు ఐక్యవేదిక నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వారు రైతులను కలిశారు. ఈ సందర్భంగా రైతు ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ, ధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతు ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్ రెడ్డి, రైతు ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, కర్నె రాజేందర్ రెడ్డి, ఎలిసే పాపన్న, మురళీధర్‌రెడ్డి, రాజిరెడ్డి, క్యాతం సాయిరెడ్డి, కొట్టాల మోహన్ రెడ్డి, బందెల మల్లయ్య, కర్నె మల్లారెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, గూడ లింగారెడ్డి, రైతు నాయకులు పాల్గొన్నారు.

మేడిపల్లి, మార్చి 10: రైతు మహాధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రైతు ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మేడిపల్లి మండలం తోంబర్‌రావుపేటలో రైతులను కలిసి ధర్నాకు తరలిరావాలని కోరారు. ఇక్కడ రైతులు మామిడి ధర్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, సాయిరెడ్డి, గంగారెడ్డి, సతీష్, వెంకటి, రాజిరెడ్డి, గంగాధర్, చిన్న మల్లయ్య, శంకర్‌రెడ్డి, నర్సారెడ్డి, భరత్ ఉన్నారు.

కోరుట్ల రూరల్, మార్చి 10 : మెట్‌పల్లి పట్టణంలో మంగళవారం జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహాధర్నా చేపడుతున్నట్లు మండల రైతు ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. మండలంలోని రైతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్సీ పరామర్శ

జగిత్యాల రూరల్, మార్చి 10: జగిత్యాల అర్బన్ మండలం దరూర్ గ్రామంలో ఏఎస్ఐ శంకరయ్య విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఆక్సిడెంట్‌లో గాయపడగా సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే, తిప్పన్నపేటలో బండారి వినోద్, మైదం ధర్మయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు శీలం మల్లేశం, మహేశ్, లక్ష్మణ్, నరేశ్, బుచ్చి రాజం, శివ పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు నివాళి

జగిత్యాల/జగిత్యాల రూరల్/కొడిమ్యాల/రాయికల్, మార్చి 10: సావిత్రీబాయి పూలే భారతరత్న ఇవ్వాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కన్వీనర్ బండారి రాజ్‌కుమార్ కోరారు. పట్టణంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం పూలే వర్ధంతి నిర్వహించారు. బీసీ సంఘ నాయకులతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు సట్ల శ్రీనివాస్, మాడిశెట్టి మల్లేశం, దీటి అంజయ్య, వెన్న మహేశ్, గట్ట రాధకిషన్, ఆదె రాజు, రాయిల్ల నారాయణ, జంగిలి వెంకటేశ్, రాపర్తి గణేశ్, రమేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు. కొడిమ్యాలలో పూలే చిత్రపటానికి దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పర్లపల్లి ప్రసాద్, కొత్తూరి స్వామి, దోమకొండ నర్సయ్య, నేరెళ్ల మహేశ్, పర్లపల్లి ప్రభుదాస్ పాల్గొన్నారు. రాయికల్ మండలం ఇటిక్యాలలో పూలే చిత్రపటానికి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బర్కం మల్లేశ్, మండల, పట్టణ కో-ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎలుగందుల ఉదయశ్రీ, మాజీ ఉప సర్పంచ్ కాడర్ల చంద్రశేఖర్, నాయకులు ప్రతాపరెడ్డి, కొల్లూరి వేణు, శ్రీనివాస్ గౌడ్, రుక్కు, రఘునాథ్, సోమన్న, భూక్యా లక్ష్మి, గంగు, గంగాధర్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గోసంగి కుల సంక్షేమ సంఘ సమావేశం

జగిత్యాల రూరల్, మార్చి 10: జగిత్యాలలో గోసంగి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్యాల సాయిచరణ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కమిటీ సమావేశం, పునరుద్ధరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మల్యాల సాయిచరణ్ మాట్లాడుతూ, అన్ని జిల్లాల్లో పర్యటించి సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్, అధికార ప్రతినిధి తిరుపతి, నాయకులు అంకమల్ల రమేశ్, సందెల రాజేశ్, అంకమల్ల శంకర్, మోహన్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

కథలాపూర్, మార్చి 10: క్షయ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ కోరారు. కథలాపూర్ మండలం ఊట్‌పల్లి, రాజారాం తండా గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో అధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇమ్రాన్, శ్రీధర్, ల్యాబ్ టెక్నీషియన్ చిన్నరాజం, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూతన నియామకం

మెట్‌పల్లి, మార్చి 10: మెట్‌పల్లి పట్టణంలోని తొమ్మిదో వార్డు పద్మశాలీ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మానపత్రి భూపతి, ఉపాధ్యక్షుడిగా గుంటుక హన్మాండ్లు, ప్రధాన కార్యదర్శిగా చిలివేరి శ్రీనివాస్, కోశాధికారిగా పసునూరి ఆనంద్, ప్రచార కార్యదర్శిగా భూపతి, గౌరవాధ్యక్షులుగా రమేశ్, సంకు గంగాధర్, సలహాదారులుగా అంజయ్య, జ్ఞానేశ్వర్, చాట్ల గణేశ్, సుధాకర్, రాధ, స్వరూప, కార్యవర్గ సభ్యులుగా రమేశ్, నరేశ్, సంతోష్, సుదర్శన్, శ్యామ్, విక్రమ్, మోహన్, మధు, శ్రీనివాస్, నాగేశ్ ఎన్నికయ్యారు. సభ్యులు నూతన కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

ఇంటి నిర్మాణ పనులు ఆపాలని వినతి

మెట్‌పల్లి టౌన్, మార్చి 10: మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డు (ఆరపేట)లో ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని కాలనీకి చెందిన అబ్దుల్ కరీం సోమవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ అనుమతులకు విరుద్ధంగా ఇంటి నిర్మాణం చేపడుతుండడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పనులు ఆపాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

వైద్య శిబిరం

కోరుట్ల, మార్చి 10: పట్టణంలో సోమవారం లారీ ఓనర్స్, వర్కర్స్ అసోసియేషన్ సభ్యులకు ప్రభుత్వ దవాఖాన సంపూర్ణ సురక్షా కేంద్రం ఆధ్వర్యంలో వివిధ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అన్వర్, వాజిద్, ఉమేర్, రాజు, ఇమ్రాన్, షకీల్, బారీ, రమేశ్, ఐసీటీసీ సిబ్బంది మల్లికార్జున్, సాజిద్, సంతోష్, అనూష, శంకర్, నాగరాజు, రమేశ్, లీలా తదితరులు పాల్గొన్నారు.

ఆభరణాలు బహూకరణ

ధర్మపురి, మార్చి 10: ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి వారికి మూడు కిలోల వెండితో చేయించిన శంఖుచక్రం, ముంజేతులను భక్తులు సమర్పించారు. దేవస్థానం మాజీ చైర్మన్ డా.ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి దంపతులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ అక్కనపెల్లి సునీల్‌కుమార్ దంపతులు, హైదరాబాద్‌కు చెందిన వెన్నం రాజేశ్వర్‌రెడ్డి దంపతులు కలిసి రూ.3 లక్షలతో ఆభరణాలు చేయించి బహూకరించారు. ఆలయ ఈవో శ్రీనివాస్, అర్చకులు శ్రీనివాస్, నేరెళ్ల వంశీ ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలపై సర్వే

కథలాపూర్, మార్చి 10: కథలాపూర్ మండలం దుంపేట, తాండ్రాల, దూలూర్, గంభీర్‌పూర్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాలపై సోమవారం సర్వే నిర్వహించారు. తొలిమెట్టులోని చతుర్విత ప్రక్